క్లుప్తంగా

ఆంధ్రభోజుడికి నివాళి



ఉయ్యాలవాడలో శ్రీ కృష్ణదేవరాయ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బలిజ సంఘం నాయకులు

ఉయ్యాలవాడ : స్థానిక కమతం వీధిలో ఏర్పాటు చేసిన శ్రీ కృష్ణ దేవరాయల విగ్రహానికి బుధవారం ఉగాది పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని బలిజ సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దక్షిణ భారతదేశాన్ని పాలించి ఆంధ్రభోజుడిగా ఖ్యాతిగాంచి రాయలసీమ గొప్పతనాన్ని చాటిన మహనీయున్ని గుర్తు చేసుకున్నారు. సంఘం గౌరవాధ్యక్షుడు వెంకటస్వామి, అధ్యక్షుడు ఆకుల వెంకటసుబ్బయ్య, కోశాధికారి అర్జిగారి నరసింహుడు, సభ్యులు కమతం చిన్న రాముడు, హుసేనయ్య పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం



ఆలయ నిర్వాహకులకు విరాళం అందజేస్తున్న దాతలు

రుద్రవరం: మండలంలోని కొండమాయపల్లె పంచాయతీ మజరా వెలగలపల్లె పొలిమేరలో వెలసిన వాసాపురం వేంకటేశ్వర స్వామి ఆలయాభివృద్ధికి ఆళ్లగడ్డ మండలం పెద్దకందుకూరు గ్రామానికి చెందిన నల్లగట్ల రామ్మోహన్‌రెడ్డి, సుబ్బలక్ష్మి దంపతులు బుధవారం రూ.50,116 నగదును విరాళంగా ఆలయ నిర్వాహకులు మధుసూదనరెడ్డి, రంగనాయకులుకు అందజేశారు.అనంతరం ఆలయ నిర్వాహకులు దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

పంచాంగ శ్రవణం

శ్రీ శోభకృత్ నామ ఉగాది పర్వదినం సందర్భంగా ఆలయంలో అర్చకులు గోపీశర్మ పంచాంగ శ్రవణం చేపట్టారు. స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు, రైతులు తమ పేరు బలాలు,ఆదాయ,ఖర్చు వంటి అంశాలపై పంచాంగం చెప్పించుకున్నారు.

జాతీయ అవార్డు గ్రహీతకు సన్మానం



విజయదుర్గను సన్మానిస్తున్న దృశ్యం

గోస్పాడు: జాతీయస్థాయిలో అవార్డు పొందిన తాటిచర్ల విజయదుర్గను నవోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. మినిస్ట్రీ ఆఫ్ కల్చరల్ ఆధ్వర్యంలో ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా ఢిల్లీలో ఇటీవల నిర్వహించిన యూనిటీ ఇన్ క్రియేటివిటీ కార్యక్రమంలో పాడిన దేశభక్తి గీతానికి జాతీయ స్థాయి అవార్డు దక్కింది. ఆమె స్వగ్రామం నెహ్రూనగర్ కావడంతో ఉగాది పండుగ సందర్భంగా స్థానికులు ఆమెను సన్మానించారు. రిటైర్డ్ టీచర్ అసాన్‌రెడ్డి, తెలుగు పండిట్ నరేష్ బాబు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు

సంజామల(కోవెలకుంట్ల): సంజామల మండలం కానాల గ్రామంలో వెలసిన సుంకులమ్మ తిరునాలను పురష్కరించుకుని గురువారం రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. న్యూకేటగిరి విభాగం రాతిదూలం లాగుడు పోటీల్లో విజేతగా నిలిచిన వృషభరాజముల యజమాన్యాలకు ప్రథమ బహుమతిగా రూ. 50 వేలు, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ. 40వేలు, రూ. 35 వేలు అందజేస్తామన్నారు. తర్వాత స్థానాలకు రూ. 25వేలు, రూ. 20వేలు, రూ. 10వేలు, రూ. 5వేలు చొప్పున బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

25న రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీలు

బనగానపల్లెరూరల్: పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో ఉగాది సందర్భంగా ఈ నెల 25న రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. విజేత జట్లకు మొదటి, రెండవ, మూడవ బహుమతులు వరుసగా రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు అందజేయనున్నట్లు తెలిపారు.

కన్నడిగులకు అన్నదానం

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని సద్గురు సనారివిశ్వేశ్వర అన్నపూర్ణదేవి ఆశ్రమం, మౌనస్వామి ఆశ్రమం, దత్తగిరి, మాణిఖ్యేశ్వరి మాత ఆశ్రమాల్లో కన్నడిగులకు గత 5 రోజులుగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అన్నపూర్ణాదేవి ఆశ్రమంలో టెంపుల్ శివోహం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆశ్రమ నిర్వాహకులు అరవింద్ రెడ్డి, కార్యనిర్వాహక సభ్యులంతా కలిసి వచ్చిన వారికి లేదనకుండా ఉదయం నుంచి రాత్రి 11 గంటల వరకు భోజన సౌకర్యంతో పాటు వారు విశ్రమించేందుకు అనుకూలంగా ఏర్పాట్లు చేశారు. తిరుపతి నాయన రమణమ్మల ఆశీస్సులతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

నవశకానికి నాంది.. ఉగాది

- వైభవంగా ఉగాది సంబరాలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- పలుచోట్ల ఆనందంగా వసంతోత్సవం
- శాస్త్రోక్తంగా పంచాంగ శ్రవణం



దొర్నిపాడులో యువకులు రంగులు చల్లుకుంటూ సందడి



విద్యుత్ కాంతులతో అంకాలమ్మ, చౌడమ్మ దేవాలయాలు



సర్వనరసింహ స్వామి ఆలయంలో జేసీకి సన్మానం చేస్తున్న ఆలయ ధర్మకర్తలు



పెద్దమ్మ దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



రుద్రవరం సమీపంలో సేద్యం పనులు ప్రారంభించిన దృశ్యం



రుద్రవరంలో పరుగు పోటీల్లో పాల్గొన్న యువకులు

దొర్నిపాడు: మండలంలో శ్రీ శోభకృత్ నామ సంవత్సరం ఉగాది పండుగను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. నవశకానికి నాంది ఉగాది అనేలా తెల్లవారుజాము నుంచే ఆలయాలకు వెళ్లి అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యం సమర్పించారు. దీంతో ఆయాగ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అనంతరం వేడుకల్లో భాగంగా పలు గ్రామాల్లో యువకులు రంగులు చల్లుకుంటూ సంతోషంగా గడిపారు. డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూల పెద్దమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

శిరివెళ్ల: మండలంలో బుధవారం శోభకృత్‌నామ సంవత్సర ఉగాది పండుగ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. అంతకుముందు గ్రామాల్లో రంగుల బండ్లు కట్టి ప్రజలు వసంతోత్సవం చేసుకున్నారు. సాయంత్రం ఆలయాల్లోలో పంచాంగ శ్రవణం వినిపించారు. నల్లమల అటవీ ప్రాంతంలోని శ్రీ సర్వనరసింహ స్వామి ఆలయంలో జేసీ నిశాంతి నరసింహ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ రామాంజనేయరెడ్డి, ఆలయ ఈఓ నరసయ్య, ధర్మకర్తలు జేసీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మహదేవపురం సర్పంచ్ రెడ్డి రమణయ్య, భక్తులు పాల్గొన్నారు.

గోస్పాడు: మండలంలోని గ్రామాల్లో ఉగాది పండుగ వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాలలో యువకులు, పెద్దలు రంగు బండ్ల ద్వారా రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాలు పంచుకున్నారు. గ్రామాల్లో సాయంత్రం ఆయా దేవాలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. షడ్రుచులను కలిపి చేసిన ఉగాది పచ్చడితో పండుగ ప్రాముఖ్యతను చాటారు.

రుద్రవరం: మండలంలోని గ్రామాల్లో ప్రజలు బుధవారం శ్రీ శోభకృత్ నామ తెలుగు సంవత్సరాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే మామిడి తోరణాలతో ఇంటి గుమ్మాలను అలంకరించి షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని సిద్ధం చేసుకున్నారు.ఏడాది పొడవున ఎదురయ్యే కష్ట సుఖాలను సంయమనంగా స్వీకరించాలన్న భావనతో ఉగాది పచ్చడిని ఆరగించారు. అనంతరం ఆయా గ్రామాల్లో వెలసిన ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. రైతులు వేద పండితుల వద్దకు వెళ్లి పంచాంగ విని వారు సూచించిన దిశగా సాయంత్రం ఎద్దులను ప్రత్యేకంగా అలంకరించి కాడితో వెళ్లి పొలాల్లో సేద్యపు పనులను ప్రారంభించారు. అలాగే రుద్రవరంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బైరి హరి,శంకర్,బ్రహ్మం తమ తల్లిదండ్రుల ట్రస్టు పేరుతో యువకులకు పరుగు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ముత్తలూరులో వినూత్నంగా ఆ గ్రామం నుంచి పోట్లేళ్లతో గ్రామ సమీపంలోని లింగమయ్య స్వామి వారి సన్నిధికి రథాన్ని లాగించి భక్తిని చాటుకున్నారు.

ఆళ్లగడ్డ: శోభకృత్ నామ నూతన తెలుగు సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం ఉగాది పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. దీంతో ఆలయాల్లో రద్దీ నెలకొంది. దిగువ అహోబిలంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామునే స్వామి, అమ్మవార్లను సుప్రభాత సేవతో మేలుకొలిపి దివ్యదర్శనం అనంతరం ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాములను కొలువుంచి అర్చన, అభిషేకం చేపట్టి ప్రత్యేకంగా అలంకరించి కొలువుంచారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను మాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం దేవాలయ ఆవరణలో ప్రధానార్చకుడు శ్రీమాన్ శఠగోప వేణుగోపాలన్ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు.



నంద్యాలలో ఉగాది పంచాంగ శ్రవణాన్ని వినిపిస్తున్న కార్తికేయ శర్మ,



రంగులు చల్లుకుంటున్న యువతీ యువకులు,



మెయిన్ బజార్‌లోని భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు,



రుద్రవరంలో పంచాంగం వినిపిస్తున్న అర్చకులు

వైభవంగా ఉగాది వేడుకలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణ ప్రజలు శుభకృత్ నామ సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ శోభకృత్ నామ ఉగాది సంవత్సరానికి స్వాగతం పలుకుతూ బుధవారం రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పట్టణంలోని వన్‌టౌన్ ప్రాంతం, టెక్కె, నూనెపల్లె, గిరినాథ్ సెంటర్, సాయిబాబానగర్, మూల సాగరం, బొమ్మల సత్రం తదితర ప్రాంతాలలో యువతీ, యువకులు ఉత్సాహంగా రంగుల బండ్లతో, డప్పుల వాయిద్యాల మధ్య పురవీధుల గుండా రంగులు చల్లుకుంటూ మధ్యాహ్నం వరకు సంబరాలు చేసుకున్నారు. పట్టణంలోని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, దర్శనాల కోసం నిర్వహించడానికి భక్తులు బారులు తీరారు.

పట్టణంలోని బైటిపేట ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామి వారికి ఉదయమే పంచామృతాభిషేకాలు, సింధూర అభిషేకం, ఆకుపూజ నిర్వహించి మహామంగళ హారతులు, నిర్వహించి విశేష పూజలు చేశారు. మెయిన్‌బజార్‌లోని సుంకులమ్మ దేవాలయంలో అమ్మవారికి అదిక సంఖ్యలో భక్తులు పాల్గొని మహానైవేద్యాలు సమర్పించారు. సంజీవనగర్ రామాలయంలో భగవత్‌సేవా సమాజ్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు సముద్రాల సూరయ్య, దేవరశెట్టి శ్రీనివాసులు ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వరస్వామి, అమ్మవార్లకు విశేష పూజలు చేపట్టి స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం వేదపండితుడు యాదవల్లి కార్తీకేయశర్మ పంచాంగం వినిపించారు. ప్రథమ నంది దేవస్థానంలో అమ్మవారి ఆలయంలో బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో విశేష పూజలు చేపట్టారు. బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక భద్రావతి భావనారుషి దేవాలయంలో సుధీంద్రాచార్యులు పంచాగశ్రవణం, ప్రవచనాన్ని జరిపించారు.



సంజీవనగర్ రామాలయంలో ప్రత్యేక అలంకారంలో వేంకటేశ్వరస్వామి



ప్రత్యేక అలకంకరణలో బైటిపేట ఆంజనేయస్వామి

వైభవంగా కంబగిరి స్వామి ఉత్సవాలు



ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న తేరుబండి



ప్రత్యేక అలంకరణలో శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి

ఉయ్యాలవాడ : మండలంలోని సుద్దమల్ల గ్రామంలో వెలిసిన శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి ఆలయం బుధవారం భక్తులతో కిటకిటలాడింది. ఉగాది పండుగ సందర్భంగా ఏటా ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. సాయంత్రం అల్లూరు, సుద్దమల్ల గ్రామస్తులు తేరుబండ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. అల్లూరు వాసులు గ్రామం నుంచి బయలుదేరి కుందూనదిలో ఎద్దులతో తేరును లాగిస్తూ గోవిందనామ స్మరణ చేస్తూ భక్తులు తేరుబండిని ఒడ్డుకు చేర్చారు. అంతకు ముందు కంబగిరిస్వామి లక్ష్మీదేవి అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని పండితులు కమలేష్‌శర్మ శాస్త్రోక్తంగా నిర్వహించారు. వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల, పట్టణాలతో పాటు మండలంలోని చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఉదయం నుంచే ఆలయానికి చేరుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అలాగే శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాల్లో వేదపండితులు పంచాగ శ్రవణం చేశారు.

నేటి నుంచి గంగ జాతర

ఉయ్యాలవాడ : మండలంలోని రూపనగుడి గ్రామంలో గురువారం నుంచి గంగ జాతర నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు మేకల శ్రీరాములు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు బొల్లావు గ్రామ ప్రవేశం, అమ్మవారికి జల్దిస్థానము, కలశస్థాపన, అఖండజ్యోతి, పలావళి, రాత్రికి కంసుడి కథ, శుక్రవారం శిద్ధభుక్తి యాగం, శమీ వృక్ష యాగం, అలుగులపోలు యాగం, శనివారం పుట్టబంగారం తెచ్చుట, పొంగుపాలు యాగం, అదే రోజు రాత్రికి గంగకాటమరాజు కథ, ఆదివారం తెల్లవారుజామున పాలేటి యాగం, అమ్మవారికి బోనాలు, సాయంత్రం మద్దిమాను నరుకుట, ఆవుల పందేరం చేపట్టుట కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు.

వసంత నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభం



సంజీవనగర్ రామాలయంలో ప్రత్యేక అలంకరణలో సీతారామ లక్ష్మణులు



బైటిపేటలోని కోదండ రామాలయంలో హారతులు అందుకుంటున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని రామాలయాల్లో ఉగాది పండుగ సందర్భంగా వసంత నవరాత్రి ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. సంజీవనగర్ రామాలయం, బైటిపేట కోదండ రామాలయం, ఎస్బీఐ కాలనీ రామాలయం, నూనెపల్లెలోని సీతారామాంజనేయ దేవాలయం, మూల సాగరంలోని కోదండ రామాలయాల్లో మొదటిరోజు వసంత నవరాత్రి ఉత్సవాలు, రామాయణ పఠనం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్లకు ఉదయాన్నే పంచామృతాభిషేకాలు, పూలంగి సేవ, అర్చనలు, సింధూర అర్చనలు నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం సంజీవనగర్ రామాలయంలో స్వామి అమ్మవార్లకు వేద పండితులు పవన్ శర్మ, కార్తికేయ శర్మ ఆధ్వర్యంలో ఊంజల్ సేవా వేడుకగా జరిపించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ చేపట్టారు.

ఆకట్టుకున్న కవిసమ్మేళనం

నంద్యాల(వ్యవసాయం): తెలుగు ప్రజల మనోతేజస్సు ఉగాది అని సూరన సారస్వత సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సహదేవుడు, రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక శ్రీ వివేకానంద ఆడిటోరియంలో శ్రీ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కవిసమ్మేళనం ఆహుతులను అలరించింది. కవులు నీలకంఠం ఆచారి, శ్రీనివాసరెడ్డి, ప్రసాద్, రత్నకుమారి, లలితాసరస్వతి, ఇంతియాజ్ అహ్మద్, ఎల్లయ్య, రఫీ, మోహన్‌రావులు వినిపించిన కవిత్వం ఆకట్టుకుంది. అనంతరం కవులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.శ్రీనివాసమూర్తి, సుబ్బయ్య, బాలరాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రైతన్నకు అపార నష్టం

- అకాల వర్షంతో దెబ్బతిన్న పైర్లు
- నేలకొరిగిన వరి, మొక్కజొన్న






కానాలపల్లె వద్ద దెబ్బతిన్న మొక్కజొన్న పైరు, దీబగుంట్ల సమీపంలో వరి పైరును కట్టలు కడుతున్న దృశ్యం

గోస్పాడు: ఇటీవల కురిసిన అకాల వర్షం రైతులకు అపార నష్టం మిగిల్చింది.ఆరుగాలం శ్రమించి పంటలు సాగు చేస్తే వడగండ్ల వర్షం కడగండ్లు మిగిల్చింది. రబీ సీజన్‌లో రైతులు వరి, మొక్కజొన్న, మినుము, మిరప, పొద్దుతిరుగుడు తదితర పంటలు సాగు చేశారు. ఇటీవల కురిసిన అకాల వర్షానికి అత్యధికంగా వరి, మొక్కజొన్న పైర్లు నేలకొరిగాయి. వరి, మొక్కజొన్న పైర్లు కోత దశలో ఉండగా వర్షం రావడంతో పైరంతా దెబ్బతినిందని అన్నదాతలు వాపోతున్నారు. అత్యధికంగా గ్రామాల్లో సాగు చేసిన పైర్లలో వరి 265 ఎకరాలు, మొక్కజొన్న 350ఎకరాలు, 350 ఎకరాల్లో మొక్కజొన్న, 35 ఎకరాల్లో పొద్దుతిరుగుడు పైర్లు దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

ఒరిగిన పైర్లను సరి చేసేందుకు అవస్థలు..

వర్షం తాకిడికి నేలకొరిగిన పైర్లను సరి చేసేందుకు రైతులు మరింత కష్టపడుతున్నారు. ఎంతో శ్రమించి పంటలు సాగు చేస్తే చివరి దశలో..మరొ కొద్ది రోజుల్లో దిగుబడి చేతికొస్తుందనుకునే సమయంలో వర్షం వారి ఆశలపై నీళ్లు చల్లింది. వడగండ్ల వానధాటికి పడిపోయిన వరి, మొక్కజొన్న పైర్లను సరిచేసి కట్టలు కట్టేందుకు కూలీలను అధిక సంఖ్యలో అవసరమవుతున్నారు. ఒక్కో కూలీకి రూ.400 నుంచి రూ.500 దాకా ఖర్చు చేయాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వరి సాగుకు ఎకరాకు రూ.25 నుంచి రూ.30వేలు, మొక్కజొన్నకు రూ.15 నుంచి రూ.20వేల దాకా ఖర్చు చేశామని, ఇలాంటి పరిస్థితిలో తమకు మరింత భారం పెరిగిందంటున్నారు.

ప్రాథమిక నివేదిక సిద్ధం చేశాం



ఇటీవల కురిసిన వర్షాల వల్ల దెబ్బతిన్న పైర్లను గుర్తించి ప్రాథమిక నివేదిక సిద్ధం చేశాం. పొలాల్లో తడిసిన పైర్లలో ఎక్కడ నీరు లేకుండా రైతులు తొలగించాలి. అలాగే 5శాతం ఉప్పు ద్రావణాన్ని పంటలపై పిచికారీ చేయాలి. వర్షాలు ఆగిన తర్వాత ఎకరాకు 25 కిలోల యూరియా, 25 కిలోల పొటాష్‌ను పిచికారీ చేయాలి. పూత, కాయలు అధికంగా రాలుతున్న పైర్లకు ప్లానోఫిక్స్ మందును 50ఎంఎల్ 225లీటర్ల నీటిలో ఎకరాకు పిచికారీ చేసి సస్యరక్షణ పద్ధతులు పాటించాలి. – అబ్దుల్‌హక్, వ్యవసాయాధికారి, గోస్పాడు

దెబ్బతిన్న మొక్కజొన్న



రబీ సీజన్‌లో నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న పైరు సాగుచేశా . ఇప్పటికే ఎకరాకు రూ.15వేలకు పైగా ఖర్చయ్యింది. వర్షం తాకిడితో పంట పూర్తిగా నేలకొరిగి దెబ్బతినింది. దీంతో పైరును కాపాడుకునేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నాం. వాటిని నిలబెట్టడానికి మరింత ఖర్చు చేయాల్సి వస్తుంది.

– నాగతిమ్మారెడ్డి, రైతు, కానాలపల్లె గ్రామం

పైరు బాగుకు అవస్థలు



రెండురోజుల క్రితం కురిసిన వర్షం వల్ల వరిపైరంతా నేలకొరిగి అవస్థలు పడుతున్నాం. పైరు కోత దశలో నేలకు ఒరగడంతో గింజలు రాలిపోతున్నాయి. అలాగే నేలపై ఉంటుండటంతో గింజలు మొలకలొస్తున్నాయి. వర్షం వల్ల నష్టపోయా. ప్రస్తుతం కట్టలు కట్టాలన్నా ఆర్థిక ఇబ్బందులతో పాటు మరింత కష్టాలకు గురి కావాల్సి వస్తుంది.

– మధు, రైతు దీబగుంట్ల గ్రామం

హోరాహోరీగా రాతిదూలం లాగుడు పోటీలు

కోవెలకుంట్ల: ఉగాది పర్వదినాన్ని పురష్కరించుకుని స్థానిక సంకులమ్మ ఆలయ సమీపంలో బుధవారం నిర్వహించిన ఒంటెద్దుబండి రాతిదూలం లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. పట్టణంలోని వివిధ కాలనీలకు చెందిన ఎనిమిది వృషభాలు పాల్గొన్న పోటీలను మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, మాజీ జెడ్పీటీసీ బీవీ ప్రసాదరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి ప్రారంభించారు. నాసారి సిద్ధయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో నిర్ణీత పది నిమిషాల వ్యవధిలో పట్టణానికి చెందిన సూర్యతేజ వృషభం అత్యధిక దూరంలాగి ప్రథమ స్థానంలో రూ. 6వేలు, ధనుంజయుడి వృషభం ద్వితీయస్థానంలో రూ. 5వేలు కైవసం చేసుకున్నాయి. తర్వాతి మూడు స్థానాల్లో పుల్లయ్య, పెద్దయ్య, యోహాన్ వృషభాలు నిలిచి రూ. 4వేలు, రూ. 3వేలు, రూ. 2వేలు దక్కించుకున్నాయి.



రాతిదూలాన్ని లాగుతున్న ఒంటెద్దు